# పోలేరమ్మ బండ కాడ మా యిల్లు

మేము కసాబ్ గల్లీని విడిచిపెట్టి పాతూరులోని పోలేరమ్మ బండకాడికి మారిపోతా ఉన్నామని తెలిసినాక నా మనసు ఎట్టెట్టో అయిపోయి దిగులు కమ్ముకొనింది.

ఇన్నాళ్లూ నాతో ఆడతా పాడతా వున్న మా వీధి పిలకాయలతో యింక తెగదెంపులే కదా అని గుర్తుకొచ్చి నా మొకంలో నీళ్లు దిగిపోయినాయి. పాతూర్లో మా నాయిన ఇల్లు కట్టి యింత పనీ చేస్తాడని ఊహించని మా వీధి పిలకాయలు కూడా మేము యిల్లు మారిపోతా వున్నామని తెలిసి బాగా డల్లయిపోయినారు. షమ్మీకైతే ఏడుపొక్కటే తక్కువ.

'రే... యియ్యాలేనంట గదరా మీరెల్లిపోయేది' అనిందా పిల్ల బాధగా.

'అవునంట' అన్నాను, నేను కూడా దిగులుగా.

షమ్మీ గమ్మగా వుండి పొయ్యింది. ఆయమ్మి మనుసులోని దిగులు నాకర్థమవతానే వుంది. ఆడుకునేటప్పుడుగానీ మా నాయినమ్మకాడ తొడబెల్లాలు పెట్టించుకుంటా ఉర్దూ పాఠాలు నేర్చుకునేటప్పుడుగానీ మేము ఎంతగా తిట్టుకున్నా, కొట్టుకున్నా చివరి నిమిషానికి మళ్లా ఒకటై పోయే వాళ్లం. ఒకటిగానే కలిసి తిరిగేవాళ్లం.

ఎప్పుడు చూసినా 'షమ్మీ షమ్మీ' అంటా షమ్మీ చుట్టే తిరిగే నన్ను నమ్ముకొని మా వీధిలోని మిగిలిన మొగపిలకాయలతో అంతగా స్నేహం చేయని షమ్మీకి నేను లేకుండా రోజులు ఎట్ట గడుస్తాయా అని యిదిగా అనిపించింది నాకు.

'అయితే యియ్యాలేనంటరా మనం ఆడుకునే దానికి ఆఖరా?' అనింది షమ్మీ.

'యియ్యాలే ఆఖరు' అన్నాను నేను.

ఆ పిల్ల వెంటనే 'దా.. చెప్తా' అంటా నా చెయ్యి పట్టుకొనింది.

చెయ్యి విడవకుండానే వీధి చివర ఉండే కాసింబీ బంకుకాడికి పిలచకెళ్లింది.

'యిద్దో తిను. అన్నీ నీకే' అని, కాసింబీ బంకులో పావలాకి అయిదు 'దూద్‌పేడా' లను కొనిచ్చి నా చేతిలో పెట్టింది. (దూద్‌పేడా అంటే పిలకాయలు తినే పాలకోవా బిళ్లలు).

'నువు తినవా?' అన్నాను మరేదకి.

'ఊహు' అనింది.

దూద్‌పేడాలు తుంచి, నాలిక మీదేసుకుని మెత్తగా చప్పరిస్తా ఉంటే నా పక్కన బారంగా అడుగులేసింది షమ్మీ.

'ఇందాక మా అమ్మా, మీ అమ్మా, జైబూన్‌ఆపా బలేగా ఏడ్చుకున్నారు తెలుసునా? మా అందర్నీ విడిచిపెట్టి పోతా ఉన్నందుకు మీ అమ్మయితే ఎక్కిళ్లు పెట్టేసింది?' అనింది షమ్మీ.


నేను ఆగినాను. 'అందుకనేనా మా అమ్మ కళ్లు ఎర్రంగా ఉండాయా' అన్నాను.

'అందుకే' అనింది షమ్మీ.

'ఛ... మా నాయిన యీ వీదిలోనే యాడైనా యిల్లు కట్టించ్చుంటే బాగుండేది కదా. ఆడాణ్ణో పాతూరులోనే కట్టించాలా?' అని, మా ఎడబాటుకు కారణమైన మా నాయిన్ను ఆడిబోసుకున్నాను.

షమ్మీ కూడా అదే మాట అని ఉన్నట్టుండి మునేళ్లతో నా గెడ్డం పట్టుకొనింది.

'రే.... నువు ఆడకెళ్లినా నన్ను మర్చిపోవుగదరా. నీకు ఎన్నిమార్లు దూద్‌పేడాలు



కొనిపెట్టింది, ఎన్నిమార్లు తగువుల్లో సపోర్టింగు వచ్చింది మర్చిపోవుగా' అనింది ప్రాదేయపూర్వకంగా.

వెడల్పుగా ఉండే ఆయమ్మి కాటుక కళ్లల్లో నీళ్లు ఉబికినాయి.


నాక్కూడా ఏడుపొచ్చింది.

'చచ'... అన్నాను కళ్లమ్మట నీళ్లు తెచ్చుకుంటా.

ఆ సాయింత్రం దాకా ఎక్కువ సేపు షమీమ్తోనే తిరగతా, మిగిలిన మా వీది పిలకాయలకి కూడా పేరు పేరునా వెళ్లొస్తానని చెప్పినాను.

అందరూ బాదపడతానే 'ఖుదాహాఫీస్' చెప్పినారు. గౌస్‌జాన్ కొడుకు సందానీ అయితే వాడి గుర్తుగా అయిదు డైమండ్ మార్కు అగ్గిపెక్కలిచ్చినాడు.

ఆ సాయింత్రమే పలావెంకారెడ్డి, పెండెం రవి, మా యిల్లు కట్టిన బేల్దారు మాలకొండయ్య, మా బందువులు, కసాబ్ గల్లీ వాళ్లు... అందర్నీ తోడు పెట్టుకొని, బూడిద గుమ్మడి కాయతో ఊరేగింపుగా వెళ్లి, దాన్నాడ పగలకొట్టి, పోలేరమ్మ బండ కాడున్న కొత్తింట్లోకి మారిపోయినాము మేము.



ఆ రాత్రే పొట్టేలు కోసించి, కొత్తింటికి రక్తం చూపించి, అందరికి బోజనాలు పెట్టించినాడు మా నాయిన.

కొత్తల్లో ఎట్టుంటదో ఏందో అని బయపడినాను గానీ కసాబ్ గల్లీ కళ కసాబ్ గల్లీదే. పాతూరు కళ పాతూరుదే. ఒకప్పుడు మా కావలి పుటక, పెరుగుదల అంతా పాతూరు నుంచే మొదలయ్యిందంట. అందువల్ల (ఇప్పటికీ) పల్లెటూరులాగా వుంటుంది మా పాతూరు. (అన్నట్టు మా కావలికి 'కావలి' అనే పేరు ఎట్టొచ్చిందో తెలుసునా? ఉదయగిరి కోటకి కాపలాగా ఒకప్పుడు మా ఊరున్న చోటులో సైనికులు కాపలా వుండేవాళ్లంట. వాళ్లలా 'కావలి' కాసినారు కాబట్టి మా వూరు 'కావలి' అయ్యింది).

మా యింటికి నాలుగడుగుల దూరంలో వుండే పోలేరమ్మ బండ కాణ్ణుంచే మొదలవుతుంది పాతూరు. ఒళ్ళంతా పొసుపు పూసుకొని పై నుంచి కింది దాకా కుంకుమ బొట్లు పెట్టుకొని అమ్మోరిలాగా ఉండే పోలేరమ్మ బండకి దండాలు పెట్టకుండా పాతూరులో అడుగుపెట్టరు ఎవ్వరూ.

ఆ బండకి సద్ది పొయ్యడం, తప్పెట్లు మోగించుకుంటా వచ్చి మొక్కులు తీర్చుకోవడం వింతగా చూస్తా ఉండే వాణ్ణి నేను. మా పాతూర్లో నాకు బాగా నచ్చిన యింకో సంగతి ఏమంటే యాడబట్టినా పచ్చని యాపచెట్లు గలగలమని కొమ్మలూపతా అవుపించడం. అయితే ఒకటే బాద. రోజులో ఒకసారన్నా బరెగొడ్ల ఉచ్చలు తొక్కకుండా, కాళ్ల కంటిన పేడను కరెంటు స్తంబాలకు పూయకుండా మా పాతూర్లో నడవడం సాద్యం కాని పని.

పాతూరులో ఎనబై శాతం కాపరాలు రెడ్లవే కాబట్టి వాళ్లతో అప్పటికే స్నేయితాలూ, ముక పరిచయాలూ ఉన్న మా నాయినకు అడ్జెస్టమెంటు ప్రాబ్లము ఎదురవలేదుగాని మా అమ్మా నాయినమ్మలు మాత్రం అల్లాడిపోయినారు. ఎందుకంటే పాతూర్లో మాది తప్పితే యింకో సాయిబనేవాడి కాపరమే లేదు. కసాబ్‌గల్లీలోలాగా పొద్దున లేస్తే 'క్యాజీ' 'ఆవ్‌జీ' అనే వాళ్లూ, యిళ్లల్లోకి వచ్చి కూచునే వాళ్లూ ఒక్కరూ లేరు. పైగా మా యింటి ఎదురుగా గల్లీ స్కూలు, యింకో తట్టు ఇరిగేషను ఆపీసు ఉండడంతో మాకసలు ఇరుగు పొరుగు అనే మాటే లాకుండా పోయింది.

'యిదేమి సత్తినాశినం పాతూరమ్మా... కూరలోకి రొంత కొత్తిమీరో, అంత అల్లం ముక్కో అడగడానికి కూడా ఎవరూ లేరా...' అంటూ అవస్తలు పడతా ఉండేది మా అమ్మ.

ఆ తర్వాత్తర్వాత మా చుట్టు పక్కలుండే అంజమ్మోళ్లు, శాంతమ్మోళ్లు మా అమ్మకు బాగా క్లోజయిపోయినారుగానీ మా నాయినమ్మకు మాత్రం కసాబ్ గల్లీలో లేని లోటు

తెలస్తానే ఉండేది.

అజాన్‌లు, నమాజ్‌లు, ఖురాన్‌లు, ఫాతెహాలు, గ్యార్‌వీలు, పలావులు, సేమ్యాలు, ఫకీర్లు, మాంసం కూరలు, మసాల వాసనలు.. ఇవన్నీ వుండే కసాబ్‌గల్లీకీ యివన్నీ అవుపించని పాతూరికీ తేడా మా నాయినమ్మకి చివరిదాకా పోలా.

ఇంక నా సంగతంటారా?

మన ఆటలకి కొదవేమీలా. రెండు మూడు వారాల్లోనే కసాబ్ గల్లీలోకన్నా మరిగింతమంది స్నేయితులను సంపాదించేసుకొని పోలేరమ్మ బండకాడ, గల్లీ స్కూలు గ్రౌండులో ఆటలు మొదలెట్టేసినాను.

కాకపోతే ఒకటి.

కసాబ్ గల్లీ నుంచి వచ్చేసినాక మా వూర్లో నాకు సాయిబనేవాడే స్నేహితుడు కాలేకపోయినాడు.

